# ‘అభివృద్ధి పేరుతో పేదల ఇళ్ళ తొలగింపు విరమించాలి’



తహశీల్‌దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**చల్లపల్లి, 6-5-17 :**

కృష్ణాజిల్లా చల్లపల్లిలో నడకుదురు రోడ్డు మార్జిన్‌లో నివాసం ఉంటున్న, చిరు వ్యాపారం, చేతి వృత్తులు చేసుకొంటున్నవారి గుడిసెలను, కత్తెర పాకలను తొలగించేందుకు రెవెన్యూ, పంచాయితీ అధికారులు సిద్ధం అవుతున్నారు. ముఖ్యంగా ఓల్డ్ ప్రభుత్వ ఆసుపత్రి ఓపి ఆవరణలో గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్న అట్టడుగువర్గాలకు చెందిన, ఎస్టీ, ఎస్సీ కులాలకు చెందిన నిరుపేదలు అక్కడి నుండి తొలగాలని, లేకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు.

ఈ పరిస్థితుల్లో పేదలు రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 6-5-2017 తేదీన ఎం.ఆర్.వో. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ ఈపూరి రాంబాబు మాట్లాడుతూ ‘ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా పేదల ఇళ్ళను తొలగించే ప్రయత్నాలను ఖండించారు. ఈ పేదలు నివేశ స్థలాలు మంజూరు చేయాలని అనేకసార్లు అర్జీలు దాఖలు చేసుకొన్నా వారికి ఇళ్ళ స్థలాలను మంజూరు చేయడం లేదని, గతంలో బైపాస్‌రోడ్డు మార్జిన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్టడుగువర్గాలు గుడారాలు వేసుకొని నివాసం ఉంటే అక్కడి నుండి దౌర్జన్యంగా తొలగించారని, ప్రస్తుతం పాత ప్రభుత్వ ఆసుపత్రి ఓపి ఆవరణ నుండి వీరిని గెంటేందుకు పూనుకొంటున్నారన్నారు. అభివృద్ధి, సుందరీకరణ పేరుతో పేదల ఇళ్ళను తొలగించటం, దౌర్జన్యంగా వీధుల్లోకి నెట్టడం పరిపాటిగా మారిందని, వీరిలో అనేకమందికి రేషన్‌కార్డులు, ఓటరు కార్డులు లేవని, ఈ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం నడకుదురు రోడ్డు మార్జిన్‌లో, పాత ప్రభుత్వ ఆసుపత్రి ఓపి ఆవరణలో నివాసం ఉంటున్న, చిరు వ్యాపారాలు చేసుకొంటున్న, చేతివృత్తులు చేసుకొంటున్న ఎస్సీ, ఎస్టీ నిరుపేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చిన తర్వాతనే ఇళ్ళు తొలగించాలని డిమాండు చేశారు.

ఈ కార్యక్రమంలో నడకుదురు రోడ్డుమార్జిన్‌లో నివాసం ఉంటున్న చిరువ్యాపారాలు, చేతివృత్తులు చేసుకొంటున్న పేదలు, మహిళలు పాల్గొన్నారు. ధర్నా అనంతరం చల్లపల్లి ఎం.ఆర్.వో.గార్కి మెమోరాండం సమర్పించారు. ఎన్‌వైయస్ నాయకులు కా॥ కుంభా రామకృష్ణ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

ooooo